మానవ సామర్థ్యాన్ని పెంపొందించడమే విద్య ఉద్దేశం

యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్

రాయదుర్గం: విద్య యొక్క ఉద్దేశ్యం మానవ సామర్థ్యాన్ని పెంపొందించడమేనని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం. జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు 'షేపింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఎడ్యుకేషన్-2047' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం-2020 కింద విద్యావ్యవస్థను మార్చడం ద్వారా స్థిరమైన, ఆరోగ్యకరమైన, శాంతియుతమైన, సురక్షితమైన భవిష్యత్తును వాస్తవికంగా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎన్ఐఓఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ సరోజ్‌శర్మ భవిష్యత్తు విద్య కోసం దిశలను, సమగ్ర విక్షిత్ భారత్-2047 ఏజెండా గురించి వివరించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్‌తో సమావేశమైన యూజీసీ చైర్మన్

ఉర్దూ విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్‌తో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్ ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూజీసీ నిధుల వినియోగం, మౌలిక వసతుల కల్పన, కోర్సులు, ఇతర అంశాల వివరాలను ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు.

నిరంతరం నిఘా

- దుర్గం చెరువు ప్రాంతంలో పోలీసు పహారా
- కేబుల్ బ్రిడ్జిపై ఐటీ పెట్రోలింగ్ సిబ్బంది పర్యవేక్షణ



దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి



రక్షణ చర్యల్లో పోలీస్ సిబ్బంది (ఫైల్)

మాదాపూర్: దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్‌బ్రిడ్జిని సందర్శించేందుకు నగర వాసులు ఆసక్తిని చూపుతున్నారు. నగరవాసులే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కేబుల్ బ్రిడ్జిపై సందడి చేసి హ్యాపీగా వెళుతున్నారు. ఈ క్రమంలో అక్కడ ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అఘాయిత్యాలు జరుగకుండా నిరంతరం నిఘా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

- కేబుల్‌బ్రిడ్జిపై సందర్శకులను రక్షణసిబ్బంది ప్రతిక్షణం గమనిస్తుంటారు.
- సందర్శకులు ఎక్కువసేపు అక్కడ నిలబడకుండా ఐటీ పెట్రోలింగ్ 24 గంటలు కేబుల్ బ్రిడ్జిపై తిరుగుతూనే ఉంటుంది.
- లేక్ పోలీస్‌స్టేషన్‌లో నలుగురు సిబ్బంది, ఒక ఎస్ఐ ఎప్పుడూ విధుల్లో ఉంటారు.
- నాలుగు బైక్‌లు చుట్టూ తిరుగుతూ గమనిస్తుంటారు. అంతేకాక రిస్క్ చేసేందుకు ఒక స్పీడ్ బోటు ఏర్పాటు చేశారు.
- సందర్శకులు కేబుల్ బ్రిడ్జిపై వాహనాలను అక్కడే నిలిపి చూస్తుంటారు. అలాంటి వారిని ఎప్పటికప్పుడు పంపిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుంటారు. ఇందులో ముగ్గురు విధులను నిర్వహిస్తున్నారు.
- పొరపాటున చెరువులో పడ్డ వారిని రక్షించేందుకు ఫైర్ సిబ్బందికి శిక్షణను ఇచ్చారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 50-60, బెండ 60, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 25, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 40, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 300 .

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ నేత

హఫీజ్‌పేట్ : ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీని మాఫీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ నేత బోయిని అనూషా మహేష్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పది రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను జీహెచ్‌ఎంసీ బీజేఎల్పీ నేత శంకర్ యాదవ్ కలిసి ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ చేయాలన్నారు. కరోనా ప్రభావంతో, ఆర్థిక మాన్యంతో ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని వారికి వడ్డీ మాఫీ చేయాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. దీనికి సానుకూలంగా కమిషనర్, బీజేపీ పార్టీ నాయకులు చేసిన విజ్ఞప్తికి సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించి వడ్డీ మాఫీ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంద్రాహిల్స్‌లో రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తాం



ఇంద్రాహిల్స్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ పరిధిలోని ఇంద్రాహిల్స్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గతంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. గురువారం సీసీ రోడ్డు నిర్మాణం జరుగనున్న ప్రాంతాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రహిల్స్ శివాలయం జంక్షన్ సీసీరోడ్డును మొదలుపెట్టి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే పాదచారులు, వాహనదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సాఫీగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత రామకృష్ణగౌడ్, డివిజన్ గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, వెంకట్‌నాయక్, ఎం. రాజు, యాదగిరి, పద్మయ్య, అనిమేష్, కళ్యాణ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ ఆదిశక్తి పోచమ్మ తల్లి, శ్రీ కనకదుర్గ భవానీ శంకర నాగరాజు సహిత నవగ్రహ దేవాలయం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, కుమారస్వామి, వెంకట రమణరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని బస్టాండ్‌లో మార్చి రెండో తేదీన దివ్యాంగుల బస్సు పాస్‌మేళాను నిర్వహించనున్నట్లు ఏటీఎం బస్‌పాస్ నిర్వాహకుడు మహేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల మేళా మార్చి 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బస్‌పాస్ కోసం వచ్చే దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు.

పనిని ఆస్వాదిస్తేనే విజయం సొంతం

- విశ్రాంత ఐఏఎస్ రాం పుల్లారెడ్డి

మణికొండ: మనం చేస్తున్న పనిని ఆస్వాదిస్తూ కృషి, పట్టుదలతో పనిచేసినప్పుడే ఉన్నత లక్ష్యాలను విజయం సాధిస్తామని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాంపుల్లారెడ్డి అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కొనసాగుతున్న వార్షికోత్సవాల్లో రెండవ రోజు నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువులపై దృష్టి పెట్టాలన్నారు. అభిరుచి, కృషి, ఆసక్తి కలిస్తే అవి శక్తివంతమైన ఫలితాలను ఇస్తాయన్నారు. గౌరవ అతిథిగా హాజరైన అంతర్జాతీయ బాడీ బిల్డర్ రామకృష్ణ మాట్లాడుతూ.. సాధన చేస్తే విజయాలు సొంతమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అనేక క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, శృతి చైర్మన్ కృష్ణారెడ్డి, సహాయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. రాజేశ్వరి, విద్యార్థి ప్రతినిధి సాయి వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నోటిఫికేషన్ విడుదల... నిరుద్యోగుల సంబరాలు



మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయటంతో సంబరాల్లో పాల్గొన్న నిరుద్యోగులు

మోతీనగర్: ఎన్నో రోజుల నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సందర్భంగా గురువారం మోతీనగర్‌లో నిరుద్యోగులు మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు కాసుల మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్ లేక ఎన్నో అవస్థలకు గురయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వివిధ రకాల ఉద్యోగాలను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయటంతో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలపై ఆశాభావం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ వెలువడటంతో నిరుద్యోగులందరూ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి విశాల్, రాహుల్, శశి, శివ, నరేష్, నజీర్, భాష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, స్టేషనరీ అందజేత



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శ్రీఅల్లూరి సీతారామరాజు జ్ఞాపకార్థం క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో 10వ తరగతి 92 మంది విద్యార్థులకు పరీక్షల ప్యాడ్, జామెంట్రీ బాక్స్, పెన్నులను గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు సాయికుమార్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ... 10వ తరగతి విద్యార్థుల జీవితానికి మూలస్తంభం లాంటిదన్నారు. పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. మంచి మార్కులతో విజయం సాధించాలన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

సున్నంచెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

మాదాపూర్: అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు. మాదాపూర్‌లోని సున్నంచెరువులో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను, ఇండ్లను గురువారం కూల్చివేశారు. బఫర్, ఎఫ్‌టీఎల్‌లలో అక్రమ నిర్మాణాలను నిర్మించవద్దని హెచ్చరించారు. ఎంతటివారిరైనా వదిలేది లేదని నిర్మిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కూల్చివేతలలో మండల గిర్దావర్ ఆర్ల శ్రీను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గం ఎన్నిక



ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ బీజేపీ కార్యాలయం ఆవరణలో ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గాన్ని ఆయన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోర్చా సెక్రటరీ పూజారాం, ఉపాధ్యక్షులు రవికుమార్‌యాదవ్, కోశాధికారి రాజారాం, మహిళా మోర్చా అధ్యక్షుడుగా కొత్తపల్లి విజయగౌడ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీకాంత్‌చారిలను నియమించి, నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, డివిజన్ సెక్రటరీ బొంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో భాగస్వాములవ్వాలి



బండ్లగూడ: ఆస్తిపన్ను వసూళ్లలో అందరూ భాగస్వాములవ్వాలని కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు.బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో గురువారం అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఆర్థిక సంవత్సరం చివరి మాసం కావడంతో అధికారులు, సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు.

లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీ ప్రహరీ కూల్చివేత



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీ ప్రహరీని జీహెచ్‌ఎంసీ సిబ్బంది గురువారం కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీకి ప్రహరీ నిర్మించారని కాలనీ వాసి ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు నేపథ్యంలో కూల్చివేతలు చేపట్టారు. గోడ ఒక ప్రాంతంలో కూల్చారు.

పగులుతున్న పైపులు..
తాగునీటికి తంటాలు

మున్సిపాలిటీల్లో నీటి కటకట

- పైపులైన్లపై నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు
- నీరందక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మూడు రోజుల క్రితం బుల్కాపూర్ వద్ద పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మణికొండ: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు దాహంతో విలవిల లాడుతున్నారు. అపార్ట్‌మెంట్లలోని బోర్లలో నీరు తక్కువ కావడంతో జలమండలి నుంచి సరఫరా చేస్తున్న అరకొర నీటితో నెట్టుకొద్దామనుకుంటే అదీ సాధ్యం కావటం లేదు. వారంలో ఓ రోజు పైప్ లైన్ పగిలిపోయిందని, నాలుగు రోజుల పాటు సరఫరాను నిలిపివేస్తున్నారు. ఇక పేదలు నివసించే ప్రాంతాల్లో సంప్‌లు లేకపోవటం, ఇరుకు కాలనీల్లోకి ట్యాంకర్లు వచ్చే పరిస్థితి లేకపోవటంతో నానా ఇక్కట్లకు గురవుతున్నామని వాపోతున్నారు. గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలతో పాటు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో నీటికి తీవ్ర కటకట ఏర్పడింది. ఫిబ్రవరి మాసంలోనే ఏకంగా నాలుగుసార్లు పైపులు పగిలిపోయాయనే కారణంతో రెండు, మూడు రోజులు సరఫరాలను నిలిపివేశారు.పైప్‌లైన్‌లను పునరుద్ధరించాక అన్ని కాలనీలకు సరఫరా వ్యవస్థ బాగుపడక ముందే మరోసారి పగిలిపోతున్నాయి. దాంతో కొన్ని కాలనీలు, బస్తీలకు వారం రోజులైనా నీటి సరఫరా జరగక పోవటంతో అక్కడి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

పైప్‌లైన్లపై నుంచి రోడ్లు...

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు మంజీరా ప్రాజెక్టు నుంచి ఖానాపూర్, షేక్‌పేట రిజర్వాయర్‌ల ద్వారా మంచినీరు సరఫరా అవుతుంది.ప్రాజెక్టు నుంచి ఖానాపూర్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి షేక్‌పేట రిజర్వాయర్‌కు వచ్చే పైప్‌లైన్ పై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. జంట మున్సిపాలిటీలతో పాటు శంకర్‌పల్లి మండల పరిధిలోను భారీ నిర్మాణాలు జరుగుతుండటం, వాటికి మెటీరియల్‌ను సరఫరా చేస్తున్న భారీ లోడు వాహనాలు వాటిపై నుంచి తిరుగుతుండటంతో పైపులపై భారం పడి అవి పగిలిపోతున్నాయని జలమండలి ట్రాన్స్‌మిషన్ విభాగం ఉద్యోగి ఒకరు తెలిపారు. పైప్‌లైన్ల పైనుంచి వాటి రాకపోకలను నివారిస్తేనే అవి పగలకుండా సకాలంలో నీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా జలమండలి ఉన్నతాధికారులు ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దండుకుంటున్న ప్రైవేటు ట్యాంకర్లు..

జలమండలి నుంచి రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోవటం, వారి తరఫున ట్యాంకర్ల సరఫరా సైతం జరగకపోవటంతో ప్రజలు తప్పనిసరి ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. వారికి డిమాండ్ పెరిగిపోవటంతో ఇష్టానుసారంగా ఒక్కో ట్యాంకర్‌కు రూ. 900 నుంచి రూ.2 వేల వరకు దండుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నీటి వ్యాపారం చేస్తున్న అలాంటి వారితో మున్సిపాలిటీ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి నిర్ణీత ధరను ప్రకటించి అంతే తీసుకునేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బస్తీలకు ఉచిత ట్యాంకర్లు పెట్టాలి..



పేదలు నివసిస్తున్న బస్తీలకు నీటి సరఫరా జరగని రోజుల్లో మున్సిపాలిటీ, జలమండలి తరపున ఉచిత ట్యాంకర్లను ఏర్పాటు చేయాలి. నీటిని నిలువ చేసుకునే సంప్‌లు లేకపోవటం, ట్యాంకర్లు ఇంటి వరకు వచ్చే రోడ్లు లేకపోవటం పెద్ద సమస్యగా మారింది. అలాంటి వారికి వారం రోజుల పాటు నీటిని సరఫరా జరగగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలి.

– నరేష్, మణికొండ క్వార్టర్స్ అధ్యక్షుడు

నాలుగు రోజులుగా సరఫరా లేదు..



ఫిబ్రవరి మాసంలో వారంలో ఓ రోజు పైప్‌లైన్ పగిలిపోయిందనే కారణంతో నాలుగు రోజులుగా నీటి సరఫరా చేయటం లేదు. పాత గ్రామాలలో ట్యాంకర్లు వచ్చే అవకాశం లేదు. వారికి సంప్‌లు అంతంత మాత్రంగానే ఉంటాయి. కాలనీల్లోనూ బోర్లు వట్టిపోవటంతో నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ పగిలితే వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– శ్వేత రవికాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మణికొండ గ్రామం

సరఫరా పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం..

సింగూరు నుంచి వచ్చే నీటి పైప్‌లైన్లు పగలటంతో సరఫరా నిలిచిపోతోంది. దశాబ్దాల క్రితం వేసిన పైపులు కావటం, నీటిని పెంచి తీసుకోవటం, విద్యుత్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోవటంతో పైపులు పగులుతున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు ప్రస్తుతం 7, 8 ఎంజీడీ నీరు వస్తోంది దాన్ని 10 ఎంజీడీలకు పెంచాలని, మణికొండలో ఉన్న గండిపేట నీటి రెండు ఫిల్టర్లను ఉపయోగించి ఆ నీటిని జంట మున్సిపాలిటీలకు సరఫరా చేయాలని ప్రతిపాదనలు పంపాం. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రస్తుతం 3.5 ఎంజీడీ నీరు వస్తోంది. అదనంగా మరో రెండు ఎంజీడీల నీటిని ఇవ్వాలని కోరాం. కృష్ణా నీటిని అదనపు పంపింగ్ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారం రోజుల్లో పరిస్థితి సర్దుకుంటోంది.

–వీరేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, జలమండలి

హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్‌కు అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ దేవేష్ నిగమ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డును గురువారం స్వీకరించారు. ఔట్‌లుక్ బిజినెస్ నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో నిర్వహించిన ఎడ్‌టెక్ సమ్మిట్-2024ను టెక్నాలజీతో విద్యను మార్చడం అనే థీమ్‌తో నిర్వహించిన సమావేశంలోఆయనకు నిర్వాహకులు అందించారు. హెచ్‌సీయూ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, పారదర్శకతతో అమలు చేస్తున్న విధానాలను అమలు చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మాదాపూర్: గుర్తు తెలియని మృతదేహం లభించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిన మేరకు.. మాదాపూర్‌లోని కావూరిహిల్స్ బస్‌స్టాప్ వద్ద లభించింది. లైట్‌గ్రీన్ కలర్ టీ షర్టు, వేసుకుని ఉన్నట్టు తెలిపారు. భిక్షాటన చేస్తున్న వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవు

రాజేంద్రనగర్: ప్రజా పంపిణీ బియ్యంతో వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ బియ్యాన్ని పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారన్న సమాచారం తమకు ఉందని స్క్రాప్ గిడ్డంగుల మధ్య రేషన్ బియ్యం దాచి రైళ్ల ద్వారా కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ప్రజా పంపిణీ బియ్యం మైలార్‌దేవ్‌పల్లి పరిసరాల్లో కొనుగోలు చేసి అక్రమ నిలువలకు కేరాఫ్ అడ్రస్‌గా టాటా నగర్ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారని పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462